www.jananinadam.com
RNI NO:TGTEL/25/A0870
Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం
తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

సంప్రదించాల్సి నెంబర్
9550100197,9490111460

బుధవారం 17-06- 2026
సంపుటి: 2 సంచిక: 53

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS

పేజీలు : 10
వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



## ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం

### స్విట్జర్లాండ్‌లో సంతకాల కార్యక్రమం

**న్యూఢిల్లీ,జూన్ 16:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుసరించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయడానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల



## విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా..
# సమగ్ర కార్యాచరణకు అధికారుల ప్రత్యేక కమిటీ

**రైతు వేదికల్లో విత్తనాలు, ఎరువుల పంపిణీ**
**..ఎరువులపైన కేంద్రం పైన ఎప్పటికప్పుడు ఒత్తిడి..**
**ఎంపీలతో కలిసి కేంద్రం వద్దకు మంత్రుల టీం వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

2వ పేజీలో...

**హైదరాబాద్ 16:** రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు.ఎంసి ఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి , వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉ



2వ పేజీలో...

## పారదర్శకంగా యూరియా పంపిణీ

**ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్**
**ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది**
**క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**కామారెడ్డి,జూన్16:**
రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ..క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం 13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం



## జూలై 19నుంచి ఉజ్జయినీ
# మహంకాళి బోనాలు

**హైదరాబాద్,జూన్16:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు ముస్తాబవుతోంది.ఈ ఏడాది నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్



2వ పేజీలో...

## అటవీ ప్రాంతమైనా
# అక్షరాస్యతలో ములుగు ముందంజ

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ**

**ములుగు. 16:** కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్ఘడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.ఈ నందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని



2వ పేజీలో...

## బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్16:** దేశంలో తెలంగాణ రాష్ట్రంలో నే యాక్సిడెంట్స్ ఎక్కవ జరుగుతున్నాయి. పది ఏండ్ల లో కేసీఆర్ రోడ్ల అభివృద్ధి ని పట్టించుకోలేదు. బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. మూడు నెలల్లో సీఎం రేవంత్ తో మాట్లాడి బకాయిలు క్లియర్ చేయిస్తా అని వాళ్లకు హామీ ఇచ్చానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి ని దృష్టిలో పెట్టుకొని చలో హైదరాబాద్ ను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసారు. మంత్రి మాట్లాడుతూ బిల్డర్లు సమ్మె ను విరమించుకుంటారని నమ్మకం ఉంది. సీనియారిటీ ప్రకారం చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాము. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి పట్టించుకోలేదు. కేసీఆర్ హయాంలో 8వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో పెట్టారు. టీమ్స్ ఆసుపత్రి




2వ పేజీలో...

## సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బండి ఆగ్రహం

**మెట్రోను అడ్డుకునే ఖర్మ కిషన్‌రెడ్డికి లేదని వెల్లడి**

**కరీంనగర్, జూన్16:** తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.మెట్రో విస్తరణను అడ్డుకోవాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్



## సన్న వడ్ల రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్..

**వ్యవసాయ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు!**

2వ పేజీలో...

**హైదరాబాద్, జూన్ 16:** తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో బోనస్ అందించే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించడంతో పాటు రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి వివరాలను సేకరించాలని, ధాన్యం దిగుబడులపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వ్యవసాయ సేవల్లో ఉపయోగించాలని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించి, విత్తనాల సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం



2వ పేజీలో...

## గ్రామీణ ఆరోగ్యానికి
# భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ 16:** ఏళ్ల పాలన నేపథ్యంలో మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో కేంద్ర మంత్రి 'చాయ్ పే చర్చ'తమపై దాడులను అరికట్టాలని కేంద్ర మంత్రికి ఆర్ఎంపీల వినతి.సంఘ భవనానికి ఆర్థిక సాయం అందించాలని

విజ&ఝప్తితెలంగాణ మెడికల్ కౌన్సిల్ మాపై దాడులు చేస్తున్నారు మమ్ముల్ని ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేమని చెప్పారు. అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు "చాయ్ పే చర్చ" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఫీల్డులో తమకు ఎదురవుతున్న సమస్యలను ఏకరవు పెట్టారు. కొంత మంది కావాలని తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మానకొండూరు నియోజకవర్గంలో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సంఘ భవనం లేదని, నూతన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ&ఝప్తి చేశారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ. ఆర్ఎంపీలపై దాడులను ఖండించారు. ఆర్ఎంపీ, పీఎంపీలతో సమాజానికి మంచి జరుగుతోందే తప్ప నష్టం జరగడం లేదు. తక్కువ



## సెమీకండక్టర్ల తయారీకి
# ఏపీ బెస్ట్ డెస్టినేషన్

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ అత్యుత్తమం**
**30 రోజుల్లో ఏపీకి వచ్చి పరిశీలించాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం**
**సింగపూర్‌లో సెమీకండక్టర్లపై 'సెమీకాన్ ఎకోసిస్టమ్ సదస్సు'లో సీఎం చంద్రబాబు**

**సింగపూర్, జూన్ 16:** సెమీకండక్టర్ల తయారీకి ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 30 రోజుల్లో ఏపీకి వచ్చి అమల్లో ఉన్న పాలసీలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. సింగపూర్‌లో సెమీకాన్ రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ అత్యంత సురక్షితమైన ప్రాంతమని, అందులో ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన రాష్ట్రమని... పెట్టుబడులకు ఇది సరైన సమయమని సీఎం వ్యాఖ్యానించారు. సెమీకండక్టర్ల తయారీకి ఏపీలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాయలసీమలో త్వరలోనే ఓ సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు అవుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఫైటర్ జెట్‌ల తయారీ సహా ఆటోమొబైల్ తయారీ కేంద్రంగా రాయలసీమ ప్రాంతంలో అవకాశాలున్నాయని అన్నారు. సెమీకండక్టర్లపై ఏర్పాటు చేసిన సెమీకాన్ ఎకోసిస్టమ్ రౌండ్ టేబుల్ సమావేశానికి సింగపూర్ లోని వివిధ సెమీకండక్టర్ తయారీ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. గ్లోబల్ ఫౌండ్రీస్, ఎన్ఎక్స్ పీ, ఏఎస్ఎంపీటీ, ఒన్ సిస్టమ్ టెక్నాలజీస్, టెక్సెండ్ ఫోటోమాస్క్, ఆక్వాటెక్ తదితర సెమీకండక్టర్ తయారీ సంస్థలు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నాయి.

## విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా..సమగ్ర కార్యాచరణకు అధికారుల ప్రత్యేక కమిటీ

మొదటిపేజీ తరువాయి...

న్నతాధికారులు పాల్గొన్నారు.ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను సమీక్ష సమావేశంలో చర్చించారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్లానింగ్ విభాగం కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతుల వివరాల నవోదు, పంటల వివరాల రికార్డులు, పంట ఉత్పత్తుల అంచనాలు, ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటుంది.ఏ రైతు ఏ పంట వేశాడు.. ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలని చెప్పారు.కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని చెప్పారు. రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించాలని, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను ఇకపై రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాల్లో వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని, రైతులకు ఉపయోగంగా ఉంటే మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు.

## ఐక్యత తో పని చేయాలి ఆదర్శ గ్రామలుగా తీర్చిదిద్దాలి

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట16:** హరీష్ రావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లో ఫోరమ్ సమిష్టిగా పని చేయాలిగ్రామాల అభివృద్ధి లో నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందినారాయణ రావు పేట మండలం ఉప సర్పంచ్ ల ఫోరం ను అభినందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.నూతనంగా ఎన్నికైన నారాయణ రావు పేట మండలం ఉప సర్పంచ్ ల ఫోరం సభ్యులు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ను సిద్దిపేట క్యాంపు కార్యాలయం లో కలిశారు. ఈ సందర్భంగా వాళ్లను శాలువా తో సన్మానించి అభినందించారు. ఉప సర్పంచ్ ల ఫోరం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందినీయమని ఇదే స్ఫూర్తి తో ఐక్యత తో కలసికట్టుగా గ్రామాల అభివృద్ధి లో పాటు పడాలని, సిద్దిపేట నియోజకవర్గం ఎన్నో అవార్డు లు సాధించి దేశం లోనే ఆదర్శం గా నిలిచిందని అందులో నారాయణ రావు పేట మండలం లో ఎన్నో ఆదర్శ గ్రామాలు గా తీర్చిదిద్దుకున్నామని చెప్పారు. అభివృద్ధి పై అడుగులు వేస్తు ప్రజల తో మైమైకమై అభివృద్ధి కి పాటు పడాలని, ఆదర్శ గ్రామాలుగా తీరదిద్దాలన్నారు నిత్యం వినూత్న కార్యక్రమాల చేపట్టే విధంగా ఫోరం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో నూతనంగా ఎన్నికైన ఫోరం అధ్యక్షుడు నవీన్ ఫోరం సభ్యుడు, మాజీ ఎంపీపీ బాల మల్లు, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కొనయ్య గారి ఎల్లయ్య, మాజీ సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్

**నిబంధనలుఅతిక్రమిస్తే కఠిన చర్యలు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**




**కరీంనగర్ 16:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాల భద్రతపై పోలీస్ మరియు రోడ్డు రవాణా శాఖ ఆర్టిఏ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణాలో నిమగ్నమైన వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు మరియు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు.?ఈ తనిఖీలలో భాగంగా, ఫిట్‌నెస్ లేని 17 స్కూల్ బస్సులు మరియు 50 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. అలాగే, సరైన పత్రాలు రిజిస్ట్రేషన్, పర్మిట్, ఇన్సూరెన్స్ లేని 64 వాహనాలపై, యూనిఫాం ధరించని 13 మంది డ్రైవర్లపై, నంబర్ ప్లేట్ లేని వాహనం మరియు ఓవర్‌లోడింగ్‌తో నడుపుతున్న 9 వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నాము. మొత్తంగా 87 వాహనాలపై ఉల్లంఘనలు నమోదు చేశాము.ప్రతి చిన్నారి భద్రత మనందరి బాధ్యత పాఠశాల వాహనాల డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదు వాహనాలకు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ మరియు ఇతర పత్రాలు ఉండాలి. వేగ నియంత్రణ పాటిస్తూ, మొబైల్ ఫోన్ వినియోగం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. కవిత, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అంజయ్య ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా యూరియా పంపిణీ

మొదటిపేజీ తరువాయి...

పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

## జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు

మొదటిపేజీ తరువాయి...

వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం, జాతరలో అత్యంత కీలకమైన ప్రధాన బోనాల ఉత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఆ రోజంతా లక్షలాది మంది మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

## బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి...

తో కలిపి 10వేల కోట్ల బకాయి ఉంది. యాదగిరిగుట్ట లో కూడా 350 కోట్ల బకాయి ఉంది. ఇప్పటి 3వేల కోట్ల బకాయి చెల్లించాం. 2500 కోట్లు అర్జెంట్ చెల్లించాల్సిన బకాయిలు ఉంది. నాగర్ కర్నూలు శ్రీనివాస్ రెడ్డి అప్పులతో ఆత్మహత్య చేసుకున్నాడు. రఘువీర్ రెడ్డి,శంకర్ లతో సహా 5గురు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. 25వేల కోట్ల పంచాయతీ రాజ్, ఖీడః రోడ్లు హామ్ వర్క్స్ నడుస్తున్నాయి. 20వేల కోట్లు టెండర్లు, అగ్రిమెంట్స్ అయిపోయాయి. డిండి కి టెండర్లు పిలిచామని అన్నారు.కేటిఆర్ హరీష్ రావుపై మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. 2014 కేసీఆర్ వేసిన డబుల్ రోడ్లు, 2018 లో పామ్ హౌస్ కు వేసుకున్న టెండర్లు చుపిస్తాం. 30నెలల్లో జరిగిన అభివృద్ధి పై చర్చకు హరీష్ రావు సిద్ధమా అని అడిగారు. నేను తెలంగాణ ఉద్యమ కారుడిగా నిజాయితీగా పని చేస్తా. సన్న బియ్యం ఇవ్వాలను మాకు కేటిఆర్ చెప్పిండా. పది ఏండ్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు,. దోడ్డు బియ్యం ఇస్తే గొడ్లు కూడా తినలేదు. కేసీఆర్ దళితులకు ముఖ్యమంత్రి ఇస్తా అని 10వేల సార్లు చెప్పిండు. సోనియాగాంధీ దేవత ఆమె లేకుండా తెలంగాణ రాదు అన్నడు. భట్టి దళితుడు సీఎల్పి నాయకుడు కాకుండా చేసింద్రు. దళితులకు ప్రతిపక్ష నేత గా ఉండొద్దా అని ప్రశ్నించారు.

## గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే

మొదటిపేజీ తరువాయి...

ఖర్చుతో కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ వైద్య సేవ అందిస్తున్నది ఆర్ఎంపీలే. ఆర్ఎంపీలు లేని సమాజాన్ని ప్రజలు ఊహించుకోలేరు. అలాంటి వారిపై దాడులు చేయడం సమర్థనీయం కాదు. ఆర్ఎంపీలు 10 రోజులు తమ సేవలను నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోవడం ఖాయం. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది ఆర్ఎంపీలే. అని చెప్పారు. మోదీ పనితీరు గురించి మాట్లాడుతూ.మోదీ విజన్ ఉన్న నేత.10 ఏళ్ల ముందు ఈ దేశం ఎలా ఉంటుందో ఆలోచించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతారు. డిజిటల్ విప్లవం అందులో భాగమే. 10 ఏళ్ల ముందు జన్ ధన్ ఖాతాలను ఓపెన్ చేసి డిజిటల్ లావా దేవీలను ప్రారంభిస్తే అందరూ హేళన చేశారు. ఇయాళ ఏమైంది? రోడ్డుపై చాయ్ అమ్ముకునే వ్యాపారాలు కూడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లావా దేవీలు జరుపుతున్నారు. ఒక్క రూపాయి అవినీతికి తావు లేకుండా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదును దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారుడి ఖాతాలోనే పడుతోంది. అని చెప్పారు.

## ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం

మొదటిపేజీ తరువాయి...

సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ.. "ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము" అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89% డెమోక్రాట్లు, 30% రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.2025 జనవరిలో 80 ఏళ్ల వయసులో ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అమెరికా చరిత్రలోనే అత్యంత వృద్ధ అధ్యక్షుడిగా రికార్డు సృష్టించారు. అప్పటి నుంచి ఆయన పలు దేశాల నుంచి దిగుమతులపై భారీ సుంకాలు విధించడం, అక్రమ వలసదారులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా ఫెడరల్ ఏజెంట్లను మోహరించడం వంటి వేగవంతమైన, దూకుడైన నిర్ణయాలు తీసుకున్నారు. అనేకమంది విశ్లేషకులు గెలవడం కష్టమని భావించిన యుద్ధంలోకి కూడా అమెరికాను నడిపించారు.దాదాపు 4 నెలల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లో శుక్రవారం సంతకాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరపున పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పాల్గొంటారని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజీద్ తఖ్త్-రవంచి తెలిపారు.

## తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన విశాల్



**తమిళనాడు15:** తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఆ క్షణం నుంచి కోలీవుడ్ ప్రముఖులంతా ఒక్కొక్కరిగా వెళ్లి ముఖ్యమంత్రి విజయ్‌ని మర్యాదపూర్వకంగా కలుస్తూనే ఉన్నారు. తాజాగా విశాల్ తన స్నేహితుడు అయిన సీఎం విజయ్‌ని కలిశారు. ఈ మేరకు ఆయన ఈ భేటీ గురించి పోస్ట్ చేశారు.'లయోలా కాలేజీలో మన పరిచయం ఏర్పడిన నాటి నుంచి నేను మిమ్మల్ని 'డార్లింగ్' అని పిలుస్తూనే ఉన్నాను.. అందులో ఎలాంటి మార్పు రాలేదు. ఓ సాధారణ హీరోగా మొదలైన మీ ప్రయాణంలోని అన్ని అడ్డంకులను, విమర్శలను ఎదుర్కొని, మీ మౌనంతో, విజయంతో వాటన్నిటినీ పక్కకు నెట్టేశారు. ఒక సూపర్‌స్టార్‌గా మీరు ఉన్నత శిఖరాలకు ఎదిగి ఈనాడు తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి అయ్యారు.ఈ రోజు పదవి, హోదా మారాయి కానీ మీరు మాత్రం మారలేదు. మిమ్మల్ని కలవడం ఎంతో ఆనందాన్నిచ్చింది, అదే ఆప్యాయతను మళ్లీ అనుభూతి చెందాను. ఎంజీఆర్ గారి నుంచి.. జయలలిత అమ్మ వరకు, స్టాలిన్ అంకుల్ నుండి నా ప్రియ సోదరుడు ఉదయ నిధి స్టాలిన్ వరకు.. మన రాష్ట్ర ముఖ్యమంత్రిని 'డార్లింగ్' అని పిలవడం ఎంతో ముచ్చటగా అనిపించింది. నాలోని ఈ మధుర క్షణాలు ఎప్పటికీ నిలిచి ఉంటాయి.మీ కోసం తీసుకు రావాల్సిన బొకే, శాలువాకి బదులుగా ఆ డబ్బును మీ తరపున, మీ పేరు మీద తమిళనాడులోని ముగ్గురు అర్హులైన నిరుపేద బాలికల చదువు కోసం ఉపయోగించినందుకు మీకు ధన్యవాదాలు. వారు మిమ్మల్ని చూసి గర్వపడతారు, మిమ్మల్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. మరోసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను. మీ పాలనలో తమిళనాడు అత్యుత్తమంగా రాణించాలని ఎదురుచూస్తున్నాను' అని అన్నారు.

## సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బండి ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి...

సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. కావాలనే ప్రాజెక్ట్సు సిఎం రేవంత్ రెడ్డి పదేపదే అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు. మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గురయ్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు. మావోయిస్టు భావజాలంతో ఏదైనా సాధిద్దాం అనే ఆలోచన ఉన్న వ్యక్తులు ఆ ఆలోచనలను విరమించుకోవాలని సూచించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని రుజువయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఇదిలఅఆవుంటే తెలంగాణలోని అధికార పార్టీ కాంగ్రెస్, ప్రత్యేకించి సీఎం రేవంత్రెడ్డి కొంత కాలంగా బీజేపీని లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్నారు. ప్రత్యేకంగా కేంద్ర మంత్రి కిషన్రెడ్డి మీద విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో తమ మీద వస్తున్న విమర్శలకు వివరణలు ఇచ్చుకోవడంతోనే కాషాయ నేతలకు పుణ్యకాలం గడిచిపోతోంది. అందుకే ఇక ఎంత మాత్రం ఉపేక్షించకూడదన్న క్లారిటీకి వచ్చి రివర్స్ అటాక్ మొదలు పెట్టిందని సమాచారం. ఇందులో భాగంగానే బండి సంజయ్ ఎదురుదాడికి దిగిటనట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్న తీరు చూస్తే కూడా రేవంత్ను ఎదిరిస్తోంది. తన సహజ శైలికి భిన్నంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దల మీద హాటు ఘాటు విమర్శలు చేస్తున్నారంటే అది కచ్చితంగా మారిన పార్టీ వైఖరిలో భాగమేనని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి మీద కౌంటర్ ఎటాక్ చేయకపోతే పార్టీ కేడర్లోకి కూడా తప్పుడు సంకేతాలు వెళతాయన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో ఉంది. అందుకే ముఖ్యమంత్రి మీద డైరెక్ట్ అటాక్ స్టార్ట్ చేసినట్టు చెబుతున్నారు. ఆట నువ్వు మొదలు పెట్టావు 2028లో ఆ ఆటను మేము ముగిస్తాం. నన్ను తెలంగాణ నుంచి తరిమికొట్టే వాడు ఇంకా పుట్టలేదు? నేను చేతకాని రాహుల్ గాంధీ నాయకత్వం పని చేయడం లేదు. మా రాజీనామాలు సరే?. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయలేని మీ సంగతి ఏంటంటూ గతంలో ఎన్నడూ లేనతం ఘాటుగా రేవంత్ మీద మాటల దాడి చేశారు. తెలంగాణ ప్రాజెక్టను కిషన్రెడ్డి అడ్డుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు సీఎం. కిషన్ రెడ్డి పై రేవంత్ వాడుతున్న భాష విషయంలో కూడా బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా బండి కూడా అటాక్ మొదలుపెట్టారు.

## సన్న వడ్ల రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి...

ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేయాలని, యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఎరువుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వానికి నిరంతరం లేఖలు రాయాలని, రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. ఈ అంశంపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని కూడా సూచించారు.

## అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ

మొదటిపేజీ తరువాయి..

పేర్కొన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

జననినాదం బుధవారం 17 జూన్ 2026

# వార్షిక లక్ష్యాల ప్రకారం రుణాలు ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

2026-27కు రూ. 3546.80 కోట్ల రుణ లక్ష్యం ఆమోదం



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 16:** అర్హులైన వారందరికీ వార్షిక రుణ లక్ష్యాల ప్రకారం రుణాలు అందించాలని జిల్లా కలెక్టరు కె. హరిత ఆదేశించారు.జిల్లా స్థాయి సమీక్షలో 2026-27కు మొత్తం 3546.80 కోట్ల రూపాయల రుణ ప్రణాళికను ఆమోదించారు. ఇందులో వ్యవసాయానికి 2642 కోట్ల రూపాయలు కేటాయించారు.స్వయం సహాయక సంఘాలకు రుణాలు తక్కువగా ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేసి, మిగిలిన సంఘాలకు వెంటనే మంజూరు చేయాలని అన్నారు. చిరు వ్యాపారులు, యువత, చేతివృత్తుల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## సాప్ట బంతి బేసు బాలు దక్షిణ ఆసియా కప్పులో

# రాణించిన చరణ్‌ను అభినందించిన కోవ లక్ష్మి



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 16:** దక్షిణ ఆసియా సాప్ట బంతి బేసు బాలు కప్పు 2026 పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముప్పిడి చరణ్‌ను ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ఘనంగా సన్మానించి అభినందించారు.జిల్లా కేంద్రంలోని శాసన సభ్యురాలి శిబిర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చరణ్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా శాసన సభ్యురాలు మాట్లాడుతూ, మారుమూల ఆసిఫాబాద్ జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటిన చరణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. చరణ్ సాధించిన విజయం జిల్లాలోని యువతకు, క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చరణ్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 16:** గ్రామస్థాయి నుండి అభివృద్ధి దిశగా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్ ,నిర్ణయ్ యాప్, ఈ - గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, పన్నులు సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలని, ఇందుకు గాను భవనాలు లేని పంచాయితీలలో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. గ్రామాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, ఈ నేపథ్యంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సి.జి.జి. కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 16:** రాష్ట్రంలో విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల- కళాశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన అనంతరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్రం భవన నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలో వి.ఓ. భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి ప్రభుత్వ భూముల ఆక్రమణపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమీక్షించారు. మండలంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో సమర్థవంతంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 16:** జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరికీ వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ముందు ఉండాలని, వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. జాతీయ కీటక జనిత వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మాత శిశు సంరక్షణ టీకాల కార్యక్రమం, కీటక జనిత వ్యాధులు నివారణ, అసంక్రమణ వ్యాధులు, క్షయ వ్యాధి నియంత్రణలో ముందస్తు చర్యలతో పాటు జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. సుధాకర్ నాయక్, డా. ప్రసాద్, డా. అనిల్, కార్యాలయ సంచాలకులు విశ్వేశ్వర్ రెడ్డి, డిపిఓ ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహ్మద్ రషీద్, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, కాకినాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 16:** ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న భోజనశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎ ఈ ను ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ లను పరిశీలించి విద్యార్థులకు మాట్లాడారు. భవనానికి వెంటనే పెయింటింగ్ వేయించాలని, ఆర్ ఓ ప్లాంట్ మరమ్మత్తు చేయించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పన దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలకు మంజూరైన బాలికల మూత్రశాలను వెంటనే నిర్మించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బికార్న దాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, మండల విద్యాధికారి వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

**ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్**

**రేగుల్‌గూడాలో సామూహిక అక్షరాభ్యాసం**



**జననినాదం,కాగజ్ నగర్ 16:** బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, విద్యకు దూరంగా ఉండే చిన్నారులు లేకుండా చూడాలని ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని రేగుల్‌గూడా గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం, సామూహిక అక్షరాభ్యాస మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన, ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నేటి చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడాయి సుశీల, ఉపసర్పంచ్ సోయం లచ్చు, ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్, గ్రామ పటేల్ సోయం సుంగు, వార్డు సభ్యుడు భీంరావ్, ఉపాధ్యాయుడు లావుడ్యా శంకర్, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**సర్పంచ్ తుంరం గోపాల్**

**రేకుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ**



**జననినాదం,తిర్యాణి 16:** గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని సర్పంచ్ తుంరం గోపాల్ అన్నారు. మండలంలోని మందగూడ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం రేకుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రత్యేక చొరవతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా గ్రామంలో అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు కొనసాగిస్తున్నామని, గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రం వినోద్, గ్రామ పటేల్ ఆత్రం గంగు, వార్డు సభ్యుడు తుంరం శ్రీను, షిడం జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చు

**ఎంఈఓ అంజయ్య**



**జననినాదం, తిర్యాణి 16:** విద్యార్థులు లక్ష్య సాధన కోసం పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని మండల విద్యాశాఖ అధికారి కె. అంజయ్య అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తిర్యాణి మండల టాపర్‌గా నిలిచిన తిర్యాణి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుండ వైష్ణవిని మంగళవారం సన్మానించి నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైష్ణవి సాధించిన విజయం మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, దత్తుమూర్తి, లవన్ కుమార్, సోమశేఖర్, మంజుల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 16:** జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య లతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదిగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, అదే రోజున జిల్లాలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2026 వనమహోత్సవం లో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్



లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటడంలో సంబంధిత అధికారులకు అటవీ అధికారులు సహాయం అందిస్తారని, మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అటవీ భూముల తగాదాలు ఉన్నచోట వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలలో మొక్కలను నాటాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసంతో చిన్నారులకు విద్యారంభం

### సర్పంచ్,ఉపసర్పంచ్

**జననినాదం,సిర్పూర్ (యు) 16:** నూతన విద్యా సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆత్రం ఓం ప్రకాష్, ఉపసర్పంచ్ పెందోర్ రామారావు, ప్రధానోపాధ్యాయుడు ఆత్రం దత్తు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు తొలిసారిగా అక్షరాలు దిద్ది విద్యాబాట పట్టారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను పెద్ద సంఖ్యలో పాఠశాలకు తీసుకురాగా, ప్రజాప్రతినిధులు చిన్నారులతో పలకలపై అక్షరాలు దిద్దించి విద్యారంభం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను వివరించి, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. సర్పంచ్ ఆత్రం ఓం ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కుటుంబం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు ఆత్రం దత్తు



మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, సీనియర్ ఉపాధ్యాయుడు ఏనుగుల భూమన్న, ఉపాధ్యాయులు కవిత, స్వప్న, షాహీనాజ్, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**జననినాదం,సిరికొండ 16:** ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ జన్మదిన వేడుకలు సిరికొండ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవను లక్ష్యంగా చేసుకుని, నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న భోజ్జు పటేల్ పేదల పాలిటి పెన్నిధని కొనియాడారు. ఆదివాసుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వేస్తున్న బాటలను ప్రశంసించారు. ఆయన నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సిరికొండ మండల ప్రజల తరపున ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బొడ్డు దత్తత్రి, కొండాపూర్ సర్పంచ్ లక్ష్మణ్, దినేష్, ప్రవీణ్, రాము, జంగుబాయి



గుణవంత్ రావ్, కుమరం దీపక్, కుమరం మీరాబాయి యాదవ్ రావు, గణపతి, మాజీ సర్పంచ్ కుమరం రఘురాం, మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, కోట్నక్ పాండు, ఉపసర్పంచులు తోకల రాజు, బాదు పటేల్, భీంరావ్, నాయకులు రంజాన్, లక్ష్మణ్, ప్రకాష్, భూపతి, జంగు, రాజన్న, యువ నాయకులు అల్లం, రాజేష్, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎదులపాడ్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

**జననినాదం,తిర్యాణి 16:** ఎదులపాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాయి సెంటర్ సర్మేడి మడావి అంబరావు మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1ఆర్ మైనర్ కెనాల్ పరిధిలో అటవీ ప్రాంతంలోని కల్వర్టుకు గండి పడటంతో సాగునీటి సరఫరాపై రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇరిగేషన్ శాఖ సర్వే నిర్వహించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ అటవీ శాఖ అనుమతుల సమస్యతో పనులు ప్రారంభం కాలేదని వివరించారు. దీంతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు. అలాగే ఎదులపాడ్ గ్రామంలో చిక్రం సూరు ఇంటి సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణానికి మంజూరు కల్పించాలని కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే కోవా లక్ష్మి సానుకూలంగా స్పందించి, 1ఆర్ మైనర్ కెనాల్ అంశంపై వెంటనే జిల్లా



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పంట విక్రయానికి వెళ్లి రైతు ఆత్మహత్య

**జననినాదం, సిరికొండ 16:** కష్టపడి పండించిన పంటను విక్రయించి కుటుంబానికి అండగా నిలవాలనుకున్న రైతు కొనుగోలు కేంద్రంలో ఎదురైన ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురై ప్రాణాలు తీసుకున్న విషాద ఘటన సిరికొండ మండలంలో చోటుచేసుకుంది. పొన్నం గ్రామానికి చెందిన రైతు పాండురంగ మంగళవారం సిరికొండ మార్కెట్ యార్డులో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాండురంగ జొన్నల విక్రయం కోసం మార్కెట్ యార్డుకు వచ్చాడు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియలో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు సంబంధిత అంశాలపై ఇబ్బందులు ఎదురుకావడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అనంతరం మార్కెట్ యార్డు సమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు సేవించాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారమైన రైతు మృతితో పొన్నం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

## శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ విజయ్ కుమార్

జననినాదం,సిరికొండ 16: మండలంలోని పోచంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యంపేట గ్రామంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ పిట్ల విజయకుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు శుద్ధజల కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ కృషి చేస్తోందన్నారు. శుద్ధజల కేంద్రం ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్



కొడప రాజు, గ్రామ పెద్దలు పటేల్, దేవరీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్ 16:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతి పత్రాలు పరిశీలించడమే కాకుండా బాధితుల సమస్యలను ఓపికగా విన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు,ఇందిరమ్మ ఇళ్లు,పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, భూసంబంధ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. కొన్ని అత్యవసర సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని



ఆదేశించారు. కాగా మరికొందరు ఆరోగ్య సమస్యలను డాక్టర్ కవ్వంపల్లి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ రిపోర్టులను పరిశీలించి వారి తగు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

## యాప్ ద్వారా ఎరువుల పంపిణీ

### మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్

**జననినాదం,తిర్యాణి 16:** ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేదని ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపల్లి రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌ను అనుసంధానం చేసి 'ఇ-పీకేబీ' యాప్ లేదా ఫర్టిలైజర్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌లో ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవాలని సూచించారు. బుకింగ్ అనంతరం టోకెన్ నంబర్, తేదీ, సమయంతో ఎస్ఎంఎస్ అందుతుందని, ఆ మేరకు వచ్చి బయోమెట్రిక్ ధృవీకరణ అనంతరం సబ్సిడీ ఎరువులు పొందవచ్చన్నారు. ఎవరైనా అదనపు ధర వసూలు చేసినా, డిమాండ్ చేసినా టోల్‌ఫ్రీ నంబర్ 1800-425-3536కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఏఈఓ కార్తీక్



మాట్లాడుతూ ఖరీఫ్ అవసరాలకు అనుగుణంగా తిర్యాణి మండలానికి యూరియా కేటాయింపు జరిగిందని తెలిపారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు దశలవారీగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కూన సురేష్, రవి, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం16:** ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి?పెద్ద వెంకటాపురం ప్రధాన రహదారిపై కుంగిపోయిన కల్వర్టును జిల్లా కలెక్టర్ అంకిత్ ా పరిశీలించారు. పరిస్థితిని గమనించిన వెంటనే వాహనం దిగి కల్వర్టును తనిఖీ చేసి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్‌డబీ శాఖ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో రాకపోకలకు అంతరాయం కలగకుండా సాంకేతిక పరిశీలన నిర్వహించి అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి వర్షాల సమయంలో ప్రజలకు అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని



ఆదేశించారు.ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అయన సూచించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ ఉషారాణి, ఎంఈఓ శాంతారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైరా ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ దివాకర

**జననినాదం,ఖమ్మం16:** ఖమ్మంజిల్లా వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంగళవారం వైరా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపీ విభాగం, ల్యాబ్తో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్ పరిసరాల పరిశుభ్రత, సౌకర్యాలు, వైద్య పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ అనవసరమైన సి-సెక్షన్లకు తావులేకుండా తల్లి, శిశు



ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్య సిబ్బంది ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా పర్యవేక్షణ చేయాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS**, and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460